క్లుప్తంగా

ప్రతి నెలా వేతనాలివ్వాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రతి నెలా వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్‌కు శనివారం ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. వచ్చేది తక్కువ వేతనం.. అది కూడా నెలల తరబడి చెల్లించక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. పేస్కేల్ అమలు చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహంతోనే మార్పు



ఫెయిలథాన్ అభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ, కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: వైఫల్యం ద్వారా నేర్చుకోవచ్చు అనే ఆలోచనను ప్రోత్సహించే లక్ష్యంతో ఫెయిలథాన్ అభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డా.కౌశిక్ అన్నారు. పట్టణంలోని బీవీరాజు ఇంజనీరింగు కాలేజీలో శనివారం మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఫెయిలథాన్ అభ్యాస కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజీ హెచ్ఓడీమృణాళిని, డీన్స్ మురళీకృష్ణ, జగన్, చంద్రబాబు, 1150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం

నర్సాపూర్: మెరుగైన వైద్యం అవసరమైన వారికి సీఎంఆర్ఎఫ్‌తో పొందవచ్చని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల కాలేజీ ఆవరణలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు వెల్దుర్తికి చెందిన యాదగిరికి ఎల్ఓసీ అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



కామారెడ్డి ఎమ్మెల్యేకి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. గురుస్వామి లాలాగౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్ రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసి, ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ కలెక్టరేట్: సీపీఎం రాష్ట్ర మహాసభల కోసం శనివారం పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ ఆమె మాట్లాడుతూ.. మొదటిసారిగా ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు 2025 జనవరి 25 నుంచి 28 వరకు 4 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, బసవరాజు, మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, అజయ్, నాయకులు దుర్గ, రామవ్వ, ప్రమీల, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



పాపన్నపేట(మెదక్): విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన వేణు అనే వ్యక్తికి చెందిన గేదె మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లింది. అక్కడ రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగలడంతో షాక్‌తో అక్కడి కక్కడే మృతి చెందింది. అప్పు తెచ్చి గేదె కొనుగోలు చేస్తే కరెంట్ అధికారుల నిర్లక్ష్యానికి బలి అయ్యిందని బాధితుడు వాపోయారు. గేదె విలువ రూ.95 వేలు ఉంటుందన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి
- గురుకుల పాఠశాల సందర్శన



నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో డైట్ మెనూ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. పెరిగిన మెస్ చార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఎమ్మెల్యే నర్సాపూర్ గురుకుల పాఠశాల సిబ్బందికి సూచించారు. శనివారం నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని వడ్డించేందుకు గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలో విద్యతో పాటు ఆటపాటలు నేర్పిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేస్తుందన్నారు. హైదరాబాద్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శిల్పవల్లి కామన్ డైట్ మెనూతో పాస్‌బుక్‌ను సునీతారెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమ్, కౌన్సిలర్ బాల్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, సత్యంగౌడ్, మాజీ సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, వెంకన్న, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఇష్టాలకు తగ్గట్లుగా మెనూ



మెదక్‌జోన్: విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు

మెదక్‌జోన్: విద్యార్థుల ఇష్టాలను పరిగణలోకి తీసుకొని మెనూ రూపొందించామని ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పిల్లలకు అందించే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాలలో పథకాన్ని ప్రారంభించారు. డైట్ మెనూ చాట్ ఆవిష్కరించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే పది ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో ఉండాలని కోరారు. అందుకు తగ్గట్లుగా కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మావతి, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో విద్యార్థులతో పనులు



రోడ్డుకు ఇరువైపులా సున్నంతో లైను వేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచి అన్ని ప్రభుత్వ హాస్టళ్ల, గురుకులాల్లో మెనూను ప్రారంభించారు. కానీ మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీల్లో అధికారులు మాత్రం విద్యార్థులతో లేబర్ పనులు చేయించారు. పట్టణంలోని ప్రభుత్వం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కాలేజీల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల ప్రారంభోత్సవాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జెంలానాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా మైనార్టీ పాఠశాల, కాలేజీ జాతీయ రహదారికి కొద్ది దూరంలో ఉంటుంది. దీంతో జాతీయ రహదారి నుంచి పాఠశాల, కాలేజీ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా సున్నంతో లైను వేసే పనులు మైనార్టీ పాఠశాల కాలేజీ విద్యార్థులతో వేయించారు. ఈ విషయమై మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నసీమా షేక్‌ను వివరణ కోరగా.. విద్యార్థులతో రోడ్డుకు ఇరుపక్కల సున్నంతో లైను వేయించిన విషయం తనకు తెలియదని చెప్పారు.

నిరంతరం సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

ఎంపీడీఓ చంద్రశేఖర్



అల్లాదుర్గం ఎస్సీ హాస్టల్‌లోని సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లయ్య

అల్లాదుర్గం(మెదక్): సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు, ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. శనివారం అల్లాదుర్గం బాలుర ఎస్సీ, బీసీ బాలికల హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో హాస్టళ్లను ఆకస్మిగా తనిఖీ చేస్తామన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించకపోయినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, కార్యదర్శి ప్రభకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని నిర్వహించే ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. చేగుంటలో శనివారం ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని ఈనెల 17న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్మాగ్రహ దీక్షకు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణలో తపస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు సురేందర్, కృష్ణమూర్తి, రేఖ, సుమతి, అమరేశ్వరీ, రమేశ్ పాల్గొన్నారు.

పటేల్ చెరువులో మట్టి తవ్వకాలు



మట్టి తవ్వకాలు నిర్వహించిన అక్రమార్కులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల పటేల్ చెరువులో నుంచి అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేస్తున్నారని పలువురు రైతులు వాపోయారు. జేసీబీ ద్వారా శిఖం భూముల్లో నుంచి తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు శిఖం భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు చేస్తూ వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఈఈ సునీత వివరణ కోరగా.. షేగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతుల పొలాలకు మట్టి తరలింపుకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అయిల్‌పామ్ సాగుతో లాభాలు



మడూర్ గ్రామశివారులో అయిల్‌పామ్ మొక్కలను నాటుతున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): అయిల్‌పామ్ సాగు లాభాల బాటలో సాగుతుందని హార్టికల్చర్ రాష్ట్ర అధికారి డాక్టర్ రంగనాయకులు అన్నారు. మండలంలోని మడూర్ గ్రామ శివారులో కుమార్‌గౌడ్ వ్యవసాయ పొలంలో పదెకరాల్లో అయిల్‌పామ్ సాగును డాక్టర్ రంగనాయకులు ప్రారంభించారు. శనివారం ఈ సందర్భంగా అయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, యజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అయిల్‌పామ్ సాగు లాభాల బాటలో సాగుతుందని, ప్రస్తుతం టన్ను అయిల్‌పామ్ గెల ధర రూ.20 వేల పైనే ఉందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ టెక్నికల్ మేనేజర్ కృష్ణ, చిన్నశంకరంపేట ఫీల్డ్ అధికారి సుజాత పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా కనెక్షన్లు తొలగిస్తారా?



విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

మెదక్ మున్సిపాలిటీ: నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ కనెక్షన్లు ఎలా తొలగిస్తారంటూ బాధితులు శనివారం మెదక్ పట్టణ విద్యుత్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మెదక్ పట్టణంలోని 26వ వార్డు శాంతినగర్, 27, 13వ వార్డు గోల్కొండ కాలనీలో అత్యధిక శాతం దళితులు నివసిస్తారు. ఈ వార్డుల్లో ముందస్తు సమాచారం లేకుండా ఏలాంటి బకాయి నోటీస్ ఇవ్వకుండా ఎస్సీ గృహాలకు కరెంట్ సరఫరాను అర్ధరాత్రి అకారణంగా కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గృహాలపై దౌర్జన్యంగా బెదిరింపులకు పాల్పడుతూ విద్యుత్ కలెక్షన్ వైర్లను తొలగిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మీటర్లు లేని నిరుపేద గృహాలను గుర్తించి తక్షణమే ఉచిత మీటర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కుటుంబాలకు అన్నింటికీ ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. తొలగించిన విద్యుత్ ప్రతి ఇంటికి యథావిధిగా కలెక్షన్లు ఇవ్వాలని బాధితులు కోరారు.

పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా కేంద్రంలో మూల్యాంకన కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర బాధ్యులు మల్లారెడ్డి జిల్లా బాధ్యులు శ్రీనివాస్, రాఘవేంద్ర చారి, మండల అధ్యక్షులు వీరేశం, చంద్రశేఖర్, నాగరాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ భవాని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నర్సాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం నిర్వహించనున్నారు. ఆలయంలో ఉదయం పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



పెద్దశంకరంపేటలో హోమం చేస్తున్న భక్తులు



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..

కొల్చారం(నర్సాపూర్): దత్తాత్రేయుడి జయంతి వేడుకలు శనివారం రంగంపేట ఆశ్రమంలో వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి గురు మాధవానంద స్వామి జయంతి వేడుకలు సైతం ఇదే రోజు కావడంతో ఆశ్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దత్తాత్రేయ స్వామికి మాధవానంద స్వామి పూజలు చేశారు.

కాళ్లకల్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో దత్త జయంతిని దత్తగిరి ఆశ్రమ నిర్వాహకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు దేవాలయం వద్ద గురు చరిత్ర పారాయణం, హోమం పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ లావణ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో..

తూప్రాన్: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో దత్తజయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాయిశర్మ, రామకృష్ణ శర్మ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మానిక్‌ప్రభు ఆలయంలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని మానిక్‌ప్రభు, సంతోషిమాత ఆలయాలతో పాటు గొట్టిముక్కులలోని దత్తాత్రేయ ఆలయంలో దత్తత్రేయ జయంతిని నిర్వహించారు.

'భోజనం'లో మెనూ తప్పనిసరి

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మెస్ ఛార్జీలు పెంచింది. జిల్లాలోని అన్ని మండలాల్లోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను అధికారులు, నాయకులు సందర్శించి నూతన డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా అధికారులు మాట్లాడారు. పాపన్నపేటలో డీఎల్పీఓ సురేశ్‌బాబు మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు భోజనం వడ్డించాలని తెలిపారు. ముఖ్యంగా భోజనం చేసేముందు చేతులు శుభ్రంగా కడుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నశంకరంపేటలో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో పౌష్టికాహారం అందించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటయ్య అన్నారు.



పాపన్నపేట(మెదక్): విద్యార్థులతో డీఎల్పీఓ సురేశ్‌బాబు



రామాయంపేట(మెదక్): బాలికల వసతి గృహంలో డైట్ మెనూ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్



కొల్చారం(నర్సాపూర్): రంగంపేట విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్



శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా ఉద్యాన అధికారి ప్రదీప్‌సింగ్



తూప్రాన్: దాతర్‌పల్లి సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో..



పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

సంక్షిప్త వార్తలు

◆ చాకరిమెట్లలో భక్తుల పూజలు



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు.

◆ పోస్ట్‌మెన్‌తో ఇబ్బందులు

నర్సాపూర్ రూరల్: పోస్ట్‌మెన్‌తో ప్రతిరోజు ఇబ్బందులు వస్తున్నాయని మండలంలోని లింగాపూర్ గ్రామ కార్యదర్శి అనిత శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగాపూర్ పోస్ట్‌మెన్ చంద్రశేఖర్ ప్రతీనెల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లతో పాటు ఉపాధి హామీ కూలీల డబ్బులు ఇచ్చేందుకు సహకరించడం లేదని ఆరోపించారు. ప్రతీనెల పెన్షన్లు ఇచ్చే సమయంలో పోస్ట్‌మెన్ అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడనీ తెలిపారు. పలుమార్లు ఎంపీఓ వైద్య శ్రీనివాస్‌కు సైతం పెన్షన్ లబ్ధిదారులు, ఉపాధి కూలీలతో కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రతీనెల పెన్షన్ లబ్ధిదారులు ఉపాధి కూలీలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు గంటల కొద్ది కాలయాపన చేసి పోతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోస్టుమెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎంపీఓ వైద్య శ్రీనివాసులు వివరణ కోరగా.. బ్రాంచ్ పోస్ట్‌మెన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

◆ మేకలపై కత్తితో దాడి

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి మేకల మందపై దాడి చేయడంతో ఒక మేక మృతి చెందగా, మరో మేక తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని ఎస్.కొండాపూర్ మధిర గ్రామమైన ప్యాటగడ్డలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... ప్యాటగడ్డ గ్రామానికి చెందిన గొల్ల ముత్యాలు చెందిన మేకల కొట్టంలోకి చొరబడి రెండు మేకలను కత్తితో గాయపర్చారు. ఒక మేక చనిపోగా, మరో మేకకు తీవ్రగాయమైంది. వెటర్నరీ డాక్టర్ గీతామాలిక దానిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బి.తిమ్మాయిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎర్ర యేసు(40) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 10న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు మెదక్ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

◆ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నర్సాపూర్: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు కోరారు. ఆయన పలువురు నాయకులతో కలిసి శనివారం రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర మహాసభలు 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగుతాయని చెప్పారు. మహాసభలకు పార్టీ ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

◆ నట్టల నివారణ మాత్రల పంపిణీ



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని తుపాకులపల్లిలో పశువైద్యుల ఆధ్వర్యంలో శనివారం నల్లమబ్బు, నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 845 గొర్రెలు, 45 మేకలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు రాజిరెడ్డి, గోపాలమిత్ర చంద్రశేఖర్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.